సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



డాక్టర్లు లేక.. వైద్యం అందక

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామన్న ప్రభుత్వం మాటలు నీటి మీద రాతలుగా మారాయి. 8లో▸



దుండగులను పట్టుకుంటాం

మహిళను హత్య చేసిన దుండగులను త్వరలో పట్టుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. 8లో▸



పేదలందరికీ సన్నబియ్యం

పేదలందరికీ ఉచితంగా సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అవినీతి జలగలపై విచారణ

అర్బన్ పార్కులో పర్యటించిన విజిలెన్స్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: తాండూరు అర్బన్ పార్కులో జరిగిన అక్రమాలపై అటవీశాఖ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు.పార్కులో రూ.16 లక్షల నిధులతో చేపట్టిన వాకింగ్ పాత్ పనుల్లో బీట్ ఆఫీసర్ మల్లయ్య, సెక్షన్ అధికారి ఫీర్యానాయక్ అవినీతికి పాల్పడినట్లు ఇటీవల సాక్షి దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్ విచారణకు ఆదేశించారు. ఇప్పటికే వికారాబాద్ డీఎఫ్‌ఓ ప్రాథమిక విచారణ జరపగా, మార్చి 27వ తేదీ ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. గురువారం స్టేట్ ఫారెస్ట్ విజిలెన్స్ డీఎఫ్‌ఓ ముకుంద్ రెడ్డి ఆధ్వర్యంలో మరోసారి లోతైనా విచరణ జరిపారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారులను కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం తాండూరు రేంజ్ కార్యాలయంలో రికార్డులను, బషీరాబాద్ మండలం గొట్టిగా కళాన్ గ్రామంలో అటవీ భూముల్లో జరిగిన తవ్వకాలను పరిశీలించారు. విజిలెన్స్ అధికారులతో తాండూరు రేంజర్ శ్రీదేవి సరస్వతి ఉన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

అనంతగిరి: జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నందున కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా సమస్య ఏర్పడితే 08416-242136, 79950 61192 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

కొడంగల్: రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీఓ శ్రీనివాస్ ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గంలోని నిరుద్యోగులు అధిక సంఖ్యలో స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషశ్రీ బాలకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బార్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: కొడంగల్ పట్టణంలో బార్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి విజయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బార్ 2 ఏర్పాటు కోసం దరఖాస్తు చేసేవారు రూ.లక్ష డీడీ తీసి అందజేయాలన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తుదారులు చెల్లించే రూ.లక్ష తిరిగి చెల్లించబడదన్నారు. లక్ష రూపాయలను డీడీ లేదా చలాన్ రూపంలో డీపీఈఓ వికారాబాద్ పేరుపై తీయాలన్నారు. దరఖాస్తులు జిల్లా ఎక్సైజ్ కార్యాలయం తోపాటు ఆన్‌లైన్‌లో కూడా పొందవచ్చన్నారు.ఈ నెల 29వ తేదీ ఉదయం 11గంటలకు కలెక్టర్ సమక్షంలో డ్రా తీసి బార్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

హక్కుల కోసం ఏకమవుదాం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు పార్టీలకతీతంగా నాయకులు, ప్రజలు ఏకం కావాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్య నేతలు విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్‌రవూఫ్, పార్టీ పట్టణ అధ్యక్షులు హబీబ్‌లాల, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పునాదిపడని ‘ఇందిరమ్మ’



కాశీంపూర్‌లో పునాది సాయిలో ఆగిన ఇందిరమ్మ ఇల్లు

పైలెట్ గ్రామాల్లో పడకేసిన నిర్మాణాలు

- 20 గ్రామాలకు 2,285 ఇళ్లు మంజూరు
- ముగ్గులు వేసినా ముందుకు కదలని వైనం
- సర్కారు నిధులు సరిపోక పనుల పాతర
- బేస్‌మెంట్ పూర్తయిన గృహాలు ఒక్కశాతమే
- జిల్లాలో గృహ నిర్మాణానికి గ్రహణం

బషీరాబాద్: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి గ్రహణం పట్టుకుంది. గత ఏడాది కోటా కింద మంజూరైన ఇళ్లకు నేటికీ పునాది రాయి పడలేదు. గృహ నిర్మాణ శాఖలో సిబ్బంది కొరత, పలు నిబంధనల కారణంగా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడంలేదు. జిల్లాలోని 20 మండలాల్లో మొదటి దశ కింద 20 గ్రామాలను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. 2,285 ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ అధికారులు కలిసి జిల్లా వ్యాప్తంగా 214 ఇళ్లను ప్రాంభిస్తూ మార్కింగ్ వేశారు. మార్చి చివరి నాటికి కేవలం ఒక్క శాతం గృహాలకు మాత్రమే బేస్‌మెంట్ పనులు పూర్తయ్యాయి.

నిధులు తక్కువ.. నిబంధనలు ఎక్కువ

ఒక్కో ఇందిరమ్మ ఇంటి కోసం ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వనుంది. అయితే నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అయితే 400 నుంచి 500ల చదరపు అగుడల విస్తీర్ణంలో ఇల్లు కట్టాలని షరతు పెట్టారు. మూడు గదులతో సీసీ స్లాబ్ వేయాలి. బిల్లుల చెల్లింపు కూడా నాలుగు దశల్లో ఉంటుంది. ఈ నిబంధనలు కారణంగా లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడడానికి ఆసక్తి చూపడం లేదు.

కేవలం 30 ఇళ్లే ప్రారంభం

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున అర్జీలు వచ్చాయి. ప్రభుత్వం నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేసింది. ఇలా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 14వేల ఇళ్లు వచ్చాయి. మొదటి దశలో మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేశారు. ఇలా జిల్లాలోని 20 గ్రామాలకు 2,285 మంది లబ్ధిదారులకు అధికారులు ఇళ్లు మంజూరు పత్రాలు అందజేశారు. ఏప్రిల్ మొదటి వారం వరకు కేవలం 30 ఇళ్లు మాత్రమే ప్రారంభమయ్యాయి. బేస్‌మెంట్ పనులు పూర్తయినా ఇప్పటి వరకు బిల్లులు రాలేదు. మిగతా వారు డబ్బు లేక ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని తెలిసింది.

ఉత్సవ విగ్రహాల్లా ఇందిరమ్మ కమిటీలు

ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను నియమించింది. ఈ కమిటీల్లోని సభ్యులకు పారితోషకాలు కూడా ఇస్తామని ప్రకటించింది. అయితే పథకాల ఎంపికలో వీరి పాత్ర నామమాత్రంగానే ఉంది. పథకాలన్నీ ఆన్‌లైన్ ద్వారా మంజూరు కావడంతో కమిటీ సభ్యులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇళ్ల మంజూరులో వీరి పాత్రలేదు. మార్కింగ్ కూడా పంచాయతీ కార్యదర్శులే చూస్తున్నారు. దీంతో కమిటీలు నిద్రావస్థలోకి వెళ్లాయి.

పాత గోడలు తొలగించడానికే రూ.20 వేల ఖర్చు

కాశీంపూర్ గ్రామానికి చెందిన చెట్టుకింది అనుసూజ ఇళ్లులేని నిరుపేద మహిళ. ఈమెకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. గతంలో ఉన్న చిన్నపాటి పాత ఇల్లు కూలిపోయింది. ఇప్పుడు అక్కడ ఇల్లు కట్టుకోవడానికి జేసీబీతో పాత గోడలు తొలగించింది. ఇందుకోసం రూ.20 వేల వరకు ఖర్చు చేసింది. బేస్‌మెంట్‌కే రూ.లక్షన్నర వరకు ఖర్చు అవుతోందని ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలతో ఏమాత్రం సరిపోదన్నారు.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఇలా..

నియోజకవర్గం	ఇళ్ల సంఖ్య
పరిగి	847
తాండూరు	674
కొడంగల్	392
వికారాబాద్	360
చేవెళ్ల (నవాబుపేట)	12

డబ్బు లేక ప్రారంభించలేదు



ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినా కట్టుకోవడానికి చేతిలో చిల్లి గవ్వ లేదు. గతంలో ఇళ్లు కట్టిన వారికి బిల్లులు వస్తలేవని తెలిసింది. దీంతో భయమేస్తోంది. బేస్‌మెంట్‌కు ఇచ్చే రూ.లక్షను అడ్వాన్స్‌గా చెల్లిస్తే పనులను ప్రారంభిస్తాం. సర్కారు ఇచ్చే రూ.5 లక్షలు బండల ఇల్లుకు కూడా సరిపోవు.

– కుర్వ నర్సమ్మ, మల్కన్‌గిరి

బేస్‌మెంట్ బిల్లు రాలే




నా పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. నెల రోజుల క్రితం ఇంటి నిర్మాణం కోసం అధికారులు ముగ్గు పోశారు. ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షకు అదనంగా రూ.50వేలు ఖర్చు చేసి బేస్‌మెంట్ పూర్తి చేశా. వారం రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి ఫొటో తీసుకెళ్లాడు. కానీ బిల్లు రాలేదు. దీంతో పనులు ఆపేశా. – అనురాధ, లబ్ధిదారు మల్కన్‌గిరి

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

పైలెట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అనుకున్నంతమేర జరగడం లేదు. మంచి ముహూర్తాలు లేవని ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించడం లేదు. ఇల్లు కట్టుకున్న వారికి నాలుగు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తాం. ఇందిరమ్మ కమిటీలు ముందుండి పనులు ప్రారంభమయ్యేలా చూడాలి. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లిస్తాం. నిబంధనల మేరకు మూడు గదులతో ఇంటి నిర్మాణం చేపట్టాలి. లేకపోతే బిల్లులు ఆగిపోయే ప్రమాదం ఉంది.

– కృష్ణయ్య, పీడీ, గృహనిర్మాణ శాఖ



స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

చక్రస్నానం.. సర్వ పాప హరణం

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం దేవేరుల సమేత మలయప్ప స్వామికి చక్రస్నానం నిర్వహించారు. బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఈ వేడుక నిర్వహించడం ఆచారం. తిరుమల నుంచి వచ్చిన అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రాత్రి అశ్వవాహనంపై వీధి ఉత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజావరోహణం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్చి 26న ఎగురవేసిన ధ్వజాన్ని గురువారం రాత్రి కిందకు దింపారు. ఈ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భూదేవి శ్రీదేవి సమేత శ్రీనివాసుడు సీతారామ లక్ష్మణుల అవతారంతో తిరుచ్చి వాహనంపై ఊరేగారు. తిరుచ్చి వాహనం ముందు విష్వకుడు, చక్రతాల్వార్‌లు దేవాలయ ప్రదక్షిణ చేస్తూ ధ్వజ స్తంభం వరకు వచ్చారు. ఆలయ అర్చకులు ధ్వజ స్తంభానికి విశేష పూజలు చేశారు. అర్చకులు యాగశాల నుంచి పూర్ణకుంభంతో వచ్చి శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆవహణం చేశారు. దీంతో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ అర్చకులు ప్రకటించారు.



అశ్వవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

శభాష్ బలరాం నాయక్

కొడంగల్: ఆస్తి పన్ను వసూలులో చొరవ చూపిన కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్‌ను సీడీఎంఏ(కమిషనర్ మరియు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) టీకే శ్రీదేవి అభినందించారు. గురువారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో ప్రశంసా పత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను వసూలులో ముందున్నారని కొనియాడారు. మెరుగైన ప్రతిభ కనబరచి 83 శాతం ఆస్తి పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఆయన చూపిన చొరవను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న బలరాం నాయక్



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు ఇతర అధికారులు

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్


అనంతగిరి: భూస్వాములు, దొరల అరాచకాల నుంచి ప్రజలను కాపాడేందుకు వీరోచిత పోరాటం చేసిన గొప్ప నాయకుడు దొడ్డి కొమురయ్య అని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన జయంతిని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, డీబీసీడీఓ ఉపేందర్, డీఎస్సీడీఓ మల్లేశం, డీటీడీబ్ల్యూఓ కమలాకర్ రెడ్డితో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమురయ్య సాధారణ కుటుంబంలో జన్మించినప్పటికీ దొరల, భూస్వాముల అరాచకాలను తట్టుకోలేక పోరాటం చేశారన్నారు. వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టుకొని విసునూరు దొరల ఆగడాలను అరికట్టించడంలో ముందు వరసలో ఉండి పోరాటం చేసిన వీరుడని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలు, భూస్వాముల తుపాకీ తూటాలకు బలి అయిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ఫరీనా ఖాతున్, ఏబీసీడీఓ భీమ్ రాజ్, ఏఎస్ డబ్ల్యూఓ శుక్ర వర్ధన్ రెడ్డి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాధనంతో ఫామ్ హౌస్‌కు సీసీ రోడ్డు

కాంగ్రెస్ యువనేత నిర్వాకం

తాండూరు టౌన్: గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలంటూ జనాలు ఓ వైపు గగ్గోలు పెడుతుండగా.. మరో వైపు ఓ కాంగ్రెస్ యువ నాయకుడు ప్రజాధనంతో తన ఫామ్ హౌస్‌కు దర్జాగా సీసీ రోడ్డు వేయించుకున్నాడు. రూ.60 లక్షల నిధుల నిలువు దోపిడీకి తెరతీశాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాలాల మండలం కోకట్ గ్రామ పంచాయతీ శివారు తాండూరు పట్టణానికి ఆనుకొని ఉంటుంది. ఈ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ నాయకుడి ఫామ్ హౌస్ ఉంది. ఎన్ఆర్‌జీఎస్ నిధుల కింద తన ఫామ్ హౌస్‌కు.. అలాగే చుట్టు పక్కల ఉన్న వెంచర్లకు లాభం చేకూరేలా ప్రజాధనంతో సీసీ రోడ్డు వేసుకున్నాడు. ఇందు కోసం రూ.60 లక్షలు మంజూరు చేయించుకున్నాడు. మొత్తం నాలుగు యూనిట్లుగా, ఒక్కో యూనిట్ సీసీ రోడ్డు విలువ రూ.15 లక్షలు కాగా, ఇప్పటికే మూడు యూనిట్లు పూర్తి కావడంతో 45 లక్షల రూపాయలు చెల్లించారు. మరో యూనిట్ రోడ్డు కూడా పూర్తి కావడంతో దీనికి సంబంధించిన రూ.15 లక్షలు చెల్లించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ విషయమై బీజేపీ పట్టణ నాయకుడు నాగారం మల్లేశం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అనుచరుడైన బంటు వేణు గోపాల్‌కు రూ.60 లక్షల ప్రజాధనాన్ని సొంత పనుల కోసం వినియోగించుకున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, సీసీ రోడ్డు డబ్బులు కక్కిస్తామని, లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.





PROPOSED LIST OF WORKS UNDER MGNREGS 2024-25 IN TANDUR CONSTITUENCY

Name of the Mandal	Name of the village	Name of the Road	Est Cost (in Lakhs)
Yalal	Kokat	Laying of CC Road from Bantuvenu land to Rustum (H) at Kokat Village of Yalal (M)	15.00
Yalal	Kokat	Laying of CC Road from Rustum (H) to Pasham Ravi (H) at Kokat Village of Yalal (M) Bit - I	15.00
Yalal	Kokat	Laying of CC Road from Rustum (H) to Pasham Ravi (H) at Kokat Village of Yalal (M) Bit - II	15.00
Yalal	Kokat	Laying of CC Road from Rustum (H) to Naresh (H) at Kokat Village of Yalal (M)	15.00
			60.00

కాంగ్రెస్ యువ నాయకుడి ఫామ్ హౌస్‌కు వేసిన సీసీ రోడ్డు, సీసీ రోడ్డు వర్క్ ఆర్డర్ కాపీ

రోడ్ల నాణ్యతను పరిశీలించడమే మా బాధ్యత

రోడ్ల నాణ్యతను మాత్రమే పరిశీలిస్తాం. ఇతర విషయాలతో మాకు సంబంధం ఉండదు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఎంబీ పూర్తి చేసి డబ్బు చెల్లించాం. రూ.60 లక్షలకుగాను రూ.45 లక్షలు ఇచ్చాం. మరో రూ.15లక్షలకు రికార్డు చేయాల్సి ఉంది. –సంతోష్‌కుమార్, పీఆర్ ఏఈ, యాలాల

కాంగ్రెస్ అంటేనే మోసం

- ముఖ్యమంత్రి పాలన సగం సగం.. అంతా ఆగమాగం
- అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సర్కార్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు
- బీఆర్ఎస్సే రాష్ట్రానికి శ్రీరామ రక్ష
- మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు

కడ్తాల్: అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీలు గుప్పించిందని.. మాయమాటలతో మభ్యపెట్టి గద్దెనెక్కిన సర్కార్ పాలనలో ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. గురువారం ఆయన మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి మండల పరిధిలోని ముద్వీన్, బోయిన్‌గుట్ట తండాలో పర్యటించారు. ముద్వీన్‌లో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథనాయక్ ఆధ్వర్యంలో పేదింటి ఆడబిడ్డ షేడం యాదమ్మకు నిర్మించిన ఇంటిని ప్రారంభించి బోయిన్‌గుట్టతండాలో మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్, సంత్‌సేవాలాల్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటనే మోసమని.. తాము అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి రూ.లక్షతో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు ప్రతీ నెల రూ.2,500, రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలన సగం సగం.. అంత ఆగం ఆగంలా ఉందని ఎద్దేవా చేశారు. గతేడాది యాసంగి, వానాకాలం కలిపి రూ.13వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టి రుణమాఫీ చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ జీడీపీ, రాష్ట్ర తలసరి ఆదాయం పెంచితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి గుండాయిజం, కుటుంబ ఆదాయం పెంచుకుంటున్నారని ఆరోపించారు. ఫోర్త్ సిటీ ఎవరి కోసం.. పేదల భూములు లాక్కొని గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం ఎందుకోసమని ప్రశ్నించారు. పేదలకు పట్టాలిస్తామని చెప్పిన ప్రభుత్వం.. గద్దెనెక్కి భూములు గుంజుకుంటుందని మండిపడ్డారు. నెలకు రూ.4వేల ఫించన్ ఇస్తామని 16 నెలల పాలనలో రెండు నెలల ఫించన్లు ఎగ్గొటాదన్నారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, కేసీఆర్ కిట్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అన్ని బంద్ అయ్యాయని వివరించారు. ప్రభుత్వం హెచ్‌సీ యూ వర్సిటీ భూములు అమ్ముకునేందుకు కుట్రపన్నుతోందన్నారు. నల్లమల బిడ్డనని, పాలమూరు బిడ్డనని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డికి పౌరుషం ఉంటే పోలీసులు లేకుండా బోయిన్‌గుట్ట తండాకు వస్తే ప్రజలే సమాధానం చెబుతారని సవాల్ విసిరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ప్రతీ పేదవాడి అకౌంట్‌లో రూ.15లక్షలు వేస్తామని మోసం చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్నారు.

రాష్ట్రంలో రక్షణ కరువు: సబితారెడ్డి

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. విదేశీ మహిళలపై దాడులు జరుగుతుంటే రక్షణ ఎక్కడ ఉందని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో మహిళపై జరిగిన దాడి అత్యంత దారుణమని, రాష్ట్రంలో మహిళలపై హింస పెరిగిపోయిందని, ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న దాడులను నిరోధించడంలో విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్, ఉపాధ్యక్షుడు ధశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం, ఎర్రోళ్ల శ్రీను తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో సబితారెడ్డి

క్లుప్తంగా

విద్యార్థులకు జూన్‌లోపు దుస్తులు అందించాలి



బట్టను అందిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: వచ్చే జూన్ లోపు విద్యార్థులకు దుస్తులను అందించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఐకేపీ సీసీలకు బట్టను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు తిరిగి ప్రారంభానికి ముందే దుస్తులు అందించాలన్నారు. డ్వాక్రా మహిళలకు ఉపాధి అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఐకేపీకి అందించిందని తెలిపారు. ఒక దుస్తు కుట్టుడానికి ప్రభుత్వం రూ.75లు అందిస్తుందన్నారు. గతేడాది 3136 మంది విద్యార్థులకు దుస్తులను కుట్టి ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ఏపీఎం రాజు తదితరులు ఉన్నారు.

భార్యను దూషించాడని దాడి

కర్రతో బాదడంతో వృద్ధుడి దుర్మరణం



తలారి కిష్టయ్య మృతదేహం

మోమిన్‌పేట: తన భార్యను దూషించాడనే నెపంతో ఓ వృద్ధుడు ఎదురింట్లో ఉండే మరో వృద్ధుడిని కర్రతో బాదడంతో అతడు మృతి చెందాడు. ఈ సంఘటన మోమిన్‌పేటలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ అరవింద్, స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఏన్కతల గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య(72), పామనోల్ల కిష్టయ్యలు ఎదురెదురుగా నివాసం ఉంటున్నారు. ఇరువురికీ ఎప్పటినుంచో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఘర్షణ పడ్డారు. పరస్పరం దూషించుకున్నారు. పామనోల్ల కిష్టయ్య తన భార్య లక్ష్మిని అసభ్యంగా తిట్టాడని కక్ష పెంచుకున్నాడు. గురువారం వేకువజామున ఇంటి వరండాలో నిద్రపోతున్న తలారి కిష్టయ్య తలపై కర్రతో అతడు దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుడి కుమారుడు తలారి బస్వరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత



పోలీస్‌స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్

బొంరాస్‌పేట: అక్రమంగా తరలిస్తున్న ఇసుక వాహనాలను పోలీసులు అడ్డుకొని ఠాణాకు తరలించిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. గురువారం తెల్లవారుజామున మద్దిమడుగుతండా నుంచి ట్రాక్టరులో, మహంతీపూర్ నుంచి టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు స్థానికంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఇరువురిపై కేసు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఎండీ రవూఫ్ తెలిపారు.

కారు ఢీకొని జింక మృతి

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై గునుగల్ అటవీ ప్రాంతం వద్ద కారు ఢీకొని జింక మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీశైలం గురువారం ఉదయం తన కారులో సాగర్ రోడ్డు నుంచి నగరానికి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో గునుగల్ అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న జింక కారుకు అడ్డంగా వచ్చింది. దీంతో ఢీకొనడంతో జింకకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. దానికి అటవీ అధికారులు దహనం చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్లు లేక.. వైద్యం అందక

- మోమిన్‌పేట పీహెచ్‌సీలో సిబ్బంది కొరత
- డిప్యూటేషన్‌పై వెళ్లడంతో సమస్య జటిలం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



మోమిన్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మోమిన్‌పేట: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామన్న ప్రభుత్వం మాటలు నీటి మీద రాతలుగా మారాయి. గ్రామీణ సర్కారు వైద్యశాలల్లో సరిపడా వైద్యులు లేక సామాన్యులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. మోమిన్‌పేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు డాక్టర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా.. కేవలం ఒక్కరితోనే రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఇక్కడికి నిత్యం 100కు పైగానే ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. మోమిన్‌పేట, మర్పల్లి, కోటపల్లి మండలాలకు చెందిన గ్రామస్తులకు అత్యవసరమైతే ఈ పీహెచ్‌సీయే దిక్కు. అలాంటి ఆసుపత్రిలో కేవలం ఒక్క డాక్టరు మాత్రమే విధులు నిర్వహించడం ఏంటని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు.

మండిపడుతున్న స్థానికులు

ఇంతకుముందు పీహెచ్‌సీలో సుజల, రషీద్ డాక్టర్లుగా విధులు నిర్వహించేవారు. కొన్ని నెలలపాటు సవ్యంగానే గ్రామీణులకు వైద్యం అందింది. కానీ ఉన్నాతాధికారులు తాత్కాలిక డిప్యూటేషన్ అంటూ డాక్టర్ రషీద్‌ను జీనుగుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపారు. ఒక నెల మాత్రమే అని చెప్పి అక్కడే విధులు నిర్వహించాలని పేర్కొన్నట్లు తెలిసింది. ఒక పక్క ప్రభుత్వం డిప్యూటేషన్‌లకు దూరం అంటూనే ఇలా చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ముగ్గురు ఉండాల్సిన చోట ఇద్దరు ఉన్నా కొంత వరకు పర్వాలేదు. కానీ ఒక్కరిపైనే రోగుల బాధ్యత పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సిబ్బందిలో ఆరుగురు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైద్యం చేసుకున్న యువకుడు



గాయాలతో వచ్చిన మండల కేంద్రానికి చెందిన యువకుడికి పీహెచ్‌సీలో సరిపడా సిబ్బంది లేక గురువారం ఇబ్బంది పడ్డారు. వైద్యం కోసం చూడగా ఎవరూ లేకపోవడంతో అతడి వెంట వచ్చిన స్నేహితుడి సాయంతో అయింట్‌మెంట్ రుద్దుకొని కట్టు కట్టుకున్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందాలంటే డాక్టర్లతో పాటు సరిపడా సిబ్బందిని నియమించాలని బాధితులు డిమాండ్ చేశారు.

"డిప్యూటేషన్ రద్దు చేయాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటేషన్‌పై ఆరుగురిని ఇతర ఆసుపత్రులకు పంపించారు. రెండు సబ్ సెంటర్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను కూడా మార్చారు. దీంతో టీకాలు(ఇమ్యునైజేషన్) చేసే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సిబ్బంది కొరతతో ఓపీ చూడటానికి సైతం అవస్థలు పడుతున్నాం. మండల ప్రజలకు సరైన వైద్యం అందించేందుకు డిప్యూటేషన్ రద్దు చేయాలి. – డాక్టర్ సుజల, మోమిన్‌పేట

దుండగులను త్వరలో పట్టుకుంటాం

జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్: మహిళను హత్య చేసిన దుండగులను త్వరలో పట్టుకుంటామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రం సమీపంలోని పెద్ద చెరువు కెనాల్ వద్ద మహిళ హత్యకు గురైన సంఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఘటనకు సంబంధించి డీఎస్పీతో మాట్లాడి వివరాలు సేకరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్స్ పరిశీలించిన విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... హత్యకు గురైన మహిళ ఆచూకీ కోసం అన్వేషిస్తున్నామన్నారు. మృతురాలి వివరాలు దొరికితే, దుండగులను త్వరలో పట్టుకునే అవకాశం ఉందన్నారు. హత్యకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ తదితరులు ఉన్నారు.

జీడి గింజలతో నాటుసారా!

- స్థావరంపై అటవీ అధికారుల దాడి
- తయారీ సామగ్రి స్వాధీనం



స్థావరంలో ఉన్న సామగ్రిని పరిశీలిస్తున్న రేంజర్ రాజేందర్, సిబ్బంది

ధారూరు: గుట్టుచప్పుడు కాకుండా అడవిలో నాటుసారా తయారీ స్థావరంపై ధారూరు ఫారెస్టు రేంజర్ బి.రాజేందర్ సిబ్బందితో కలిసి గురువారం దాడి చేశారు. తయారీకి వినియోగిస్తున్న డ్రమ్ములు, ఇత్తడి, ప్లాస్టిక్ బిందులు, వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకుని ధారూరు ఫారెస్టు రేంజ్ కార్యాలయానికి తరలించారు. రేంజర్ వివరాల ప్రకారం.. మండలంలోని సంగాయపల్లితండా అడవిలో సిబ్బంది తిరుగుతుండగా ఓ వ్యక్తి పారిపోవడం గమనించారు. పక్కనే నది ఉండటంతో అనుమానం వచ్చి ఇరువైపులా తనిఖీ చేశారు. పక్కనే నాటు సారా తయారీ స్థావరం బయటపడింది. పరిశీలించగా జీడిగింజలతో సారా తయారు చేస్తున్నట్లు ఆనవాళ్లు లభ్యమయ్యారు. తయారు చేస్తున్న వ్యక్తి నీలిగడ్డతండాకు చెందిన వాడిగా అనుమానిస్తున్నారు. వెంటనే సామగ్రిని అటవీ కార్యాలయానికి తరలించి ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చామని రేంజర్ వివరించారు.

పిడుగుపాటుకు జీవాల మృత్యువాత

25 గొర్రెలు, రెండు పశువులు దుర్మరణం

కొడంగల్ రూరల్: అకాల వర్షానికి జన జీవనం స్తంభించిపోయింది. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల పిడుగుపాటుకు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. గురువారం సాయంత్రం కురిసిన వానకు కొడంగల్ మండల పరిధిలోని ఖాజా అహ్మద్‌పల్లిలో 25 జీవాలు చనిపోయాయి. గ్రామానికి చెందిన పకీరప్ప మేకలు, గొర్రెలను మేత మేపడానికి గ్రామశివారులోని పొలాలకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో ఓ చెట్టు కిందకు 30 జీవాలు వెళ్లాయి. అకస్మాత్తుగా పిడుగుపడడంతో అందులో 25 జీవాలు మృతి చెందాయని ఆయన వాపోయాడు. దాదాపు రూ.3లక్షల విలువ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆవు, లేగదూడ మృతి

దౌల్తాబాద్: మండలంలోని కుప్పగిరి గ్రామంలో గురువారం కురిసిన వర్షానికి పిడుగుపాటుకు రెండు పశువులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మాల సాయిలు దగ్గర పుర్ర సాయిలు ఆవు, లేగదూడను కౌలుకు తీసుకున్నాడు. అయితే పుర్ర సాయిలు వాటిని ఉదయం పొలం దగ్గర కట్టేసి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో సాయంత్రం పిడుగుపాటుకు పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.1.50 లక్షలు నష్టం జరిగిందని వాపోయాడు.

రైలు ఢీకొని 18 మేకల మృతి



మేకల కళేబరాలు

షాద్‌నగర్: రైలు ఢీకొని మేకలు మృతి చెందిన ఘటన గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గడ్డం కృష్ణయ్యయాదవ్‌కు చెందిన మేకలను మేత మేసేందుకు రైల్వే ట్రాక్ పక్కకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ నుంచి కాచిగూడ వెళ్లే రైలు వచ్చింది. ఆ శబ్దానికి అవి ఒక్కసారిగా భయపడి పట్టాల పైకి పరుగులు తీశాయి. దీంతో రైలు ఢీకొని 18 మేకలు మృతి చెందాయి. దాదాపు రూ.మూడు లక్షల నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

సుపారీ ఇచ్చే నా భర్తను చంపారు



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి

- దాయాదులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి ఆందోళన
- డీసీపీ హామీతో సద్దుమణిగిన వ్యవహారం

మహేశ్వరం: భూ తగాదా వ్యవహారంలోనే తన భర్తను కారుతో ఢీకొట్టి హత మార్చారని మండలంలోని కల్వకోల్‌కు చెందిన కమల ఆరోపించారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం పిల్లలు, బంధువులతో కలిసి ఆమె మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు శంకరయ్య(52) కారు–బైక్ ఢీకొన్న ప్రమాదంలో బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే.

అన్ని కోణాల్లో విచారిస్తాం

మృతుడి భార్య కమల మాట్లాడుతూ.. తన భర్తను డ్రైవర్ ప్రశాంత్‌కి సుపారీ ఇచ్చి కారుతో వెనుక నుంచి ఢీకొట్టి దాయాదులు చంపారని ఆరోపించారు. భూ తగాదా విషయంలో కోర్టులో తీర్పు తమకే అనుకూలంగా వస్తుందని తెలియడంతో దాయాదులు హత్యకు పూనుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోలీస్‌స్టేషన్ నుంచి కదిలేది లేదన్నారు. విచారణ చేస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డిని మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘటనా స్థలానికి మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి చేరుకొని మృతుడి భార్య, పిల్లలు, బంధువులతో మాట్లాడారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకొని అన్ని కోణాల్లో విచారించి బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు వెంకట్ రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పిడుగుపాటుకు రైతు అస్వస్థత

గేదె దుర్మరణం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు

శంకర్‌పల్లి: అకాల వర్షాల కారణంగా పలుచోట్ల గురువారం పిడుగుపాటు పడ్డాయి. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురంకి చెందిన రైతు యాభైగూడెం నర్సింహారెడ్డి గేదెలు మెపుతుండగా.. వర్షానికి చెట్టు కిందకి వెళ్లాడు. తన రెండు గేదెలు పక్కనే ఉన్న మరొక చెట్టు కింద ఉన్నాయి. ఒక్కసారిగా పిడుగుపాటు పడడంతో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మరొక గేదెకి, రైతు నర్సింహారెడ్డి అస్వస్థతకు గురైయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు రైతుని పట్టణంలోని ఆసుపత్రిలో చేర్పించారు. కాసేపటికి ఆరోగ్య పరిస్థితి మెరుగయింది. గేదెని పశువైద్యులకు చూపించగా.. ప్రస్తుతం నిలకడ ఉన్నట్లు తెలిపారు.

సన్నబియ్యంతో పేదలు సంతోషం



దోమ: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తాండూరు: సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్

ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి

పరిగి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా చేపట్టిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తుందని మండిపడ్డారు. అందుకే కాంగ్రెస్ చేపట్టిన జైబాపు, జైభీమ్, జై సంవిధాన్‌ను ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని సూచించారు. అంతకుముందు పట్టణ కేంద్రంతో పాటు పెద్దమాదారం గ్రామంలోని రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు, అధికారులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో ప్రారంభం

కుల్కచర్ల: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రాత్రి 8గంటల వరకు వివిధ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యాన్ని అందజేశారు.

పేదలకు మేలు

పూడూరు: పేద ప్రజల కడుపు నింపేందుకే ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే మండల పరిధిలోని పలు గ్రామాలు చెందిన 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్‌పై ప్రచారం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్నరకంతో పేదలకు పండగ

దోమ: సన్నరకం బియ్యంతో పేదలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బొంపల్లిలో సన్న బియ్యం పంపిణీ ఆయన ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదలను ఉద్దేశించి సన్నరకం బియ్యం పంపిణీకి శ్రీకారం చూట్టారని తెలిపారు. ప్రజలకు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

తాండూరు: రేషన్‌కార్డు లబ్ధిదారులు సన్నబియ్యం పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం నియోజకవర్గంలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డుతో పాటు పాత తాండూరు ప్రాంతంలోని రేషన్ దుకాణాలలో లబ్ధిదారులకు సన్నబియ్యం అందజేశారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు కడుపునిండా అన్నం తినేందుకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతినెలా 1500 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా అవుతుందన్నారు. త్వరలోనే రేషన్ షాపుల్లో 9 రకాలతో కూడిన సరుకులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, మాజీ కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, రవి పాల్గొన్నారు.

పథకాల అమలు

బంట్వారం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆయన సన్నబియ్యం పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేస్తున్నామన్నారు. త్వరలో 9 రకాల సరుకులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లీజు ముగిసినా క్వారీని వదలట్లేదు

- హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదులు
- గాజులరామారంలో పర్యటించిన రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ జిల్లా గాజులరామారంలోని క్వారీపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో క్వారీ లీజు గడువు ముగిసినా యజమానులు అక్కడ నుంచి ఖాళీ చేయకుండా స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఇటీవల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఆరా తీసేందుకు వెళ్లిన రంగనాథ్ సమీపంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ భూముల కబ్జాలను పరిశీలించారు. ఆ ప్రాంతంలో దాదాపు 400 ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని కబ్జా కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో 78 ఎకరాలను లీజుకు తీసుకున్న వారితో హైడ్రా కమిషనర్ వచ్చే వారం కీలక సమావేశం నిర్వహించనున్నారు. గాజులరామారం నుంచి శేరిలింగంపల్లి వెళ్లిన ఆయన నల్లగండ్ల చెరువు నాలాను పరిశీలించారు. నాలా విస్తీర్ణం తగ్గకుండా చూడాలని, అక్కడ పోసిన మట్టిని తొలగించాలని వెర్టెక్స్ నిర్మాణ సంస్థను ఆదేశించారు. ఈ సందర్భంగా నాలాతో పాటు బఫర్ జోన్‌కూ ఆటంకం లేకుండా నిర్మాణాలు చేయపడతామని నిర్మాణ సంస్థ హామీ ఇచ్చింది. గోపన్నపల్లి, పుప్పాలగూడలకు వెళ్లిన కమిషనర్ మేల్లకుంట, మామాసానికుంటలను పరిశీలించారు. సర్వే నంబర్ల ప్రకారం చెరువుల హద్దులపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

ఆఫ్‌లైన్‌లో ఆర్‌వైవీఎస్‌కి అర్జీలు

ఎంపీడీఓ కార్యాలయంలో కౌంటర్ల ఏర్పాటు



దౌల్తాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్

దౌల్తాబాద్: రాజీవ్ యువ వికాసం పథకం(ఆర్‌వైవీఎస్) కింద సబ్సిడీ రుణాలకు దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 14 వరకు పొడిగించింది. అర్జీదారులకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందకపోవడంతో ప్రభుత్వం గడువును 14కు పొడగించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించలేని వారి కోసం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన దరఖాస్తు పత్రాలను నింపి అవసరమైన పత్రాలను జత చేసి కౌంటర్లలో అందజేయాలి. అనంతరం అధికారులు పరిశీలించి ఆన్‌లైన్ చేస్తారు. అయితే ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు.

సిగరెట్లు అమ్మడం లేదన్నందుకు

హోటల్ నిర్వాహకులపై దాడి



గాయపడిన బాధితులు

మేడ్చల్‌రూరల్: సిగరెట్లు అమ్మడం లేదని చెప్పినందుకు హోటల్‌లో పని చేసే వ్యక్తితో పాటు యజమాని, అతడి కుమారుడు, కుమార్తెపై దాడి చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక వినాయక్‌నగర్ కాలనీకి చెందిన రాజేశ్ చతుర్వేది సోమారం గ్రామ పరిధిలోని రిలాన్స్ గోదాం సమీపంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. సదరు హోటల్‌లో దివాకర్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. గత నెల 30న రాత్రి సమీపంలోని బండమైలారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు హోటల్‌కు వచ్చి సిగరెట్లు కావాలని అడిగారు. సిగరెట్లు అమ్మడం లేదని దివాకర్ చెప్పడంతో ఆగ్రహానికి లోనైన వారు అతడిపై దాడి చేశారు. దీనిపై అతను యజమాని రాజేశ్ చతుర్వేదికి సమాచారం అందించడంతో అతను తన కుమార్తె శివానీ, కుమారుడు కృష్ణతో కలిసి హోటల్ వద్దకు వచ్చి వారికి సర్దిచెప్పి పంపించారు. ఆ తర్వాత కొద్ది సేపటికే అక్కడికి వచ్చిన 20 మంది యువకులు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో రాజేశ్ చతుర్వేదితో పాటు అతడి కుమార్తె, కుమారుడికి గాయాలయ్యాయి. అడ్డుగా వచ్చిన రాకేశ్ చతుర్వేది అనే వ్యక్తిపై కూడా వారు దాడి చేశారు. ఈ విషయం ఎవరికైనా చెపితే చంపుతానని బెదిరించారు. ఈ విషయమై బాధితులు మర్నాడు మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.